


## తిరుమల సమాచారం

- వసతి గదులు
రూ.500:మార్చి20 నుంచి 28వరకు ఖాళీ ఉంది.
రూ.100:మార్చి 18 నుంచి28వరకు ఖాళీ ఉంది.
రూ.50: మార్చి 11 నుంచి 28వ తేదీ వరకు ఖాళీ ఉంది.
- శ్రీనివాసమ్: మార్చి 11 నుంచి 28వ తేదీ వరకు ఖాళీ ఉంది.
- దర్శనం: ఫిబ్రవరి 1 నుంచి మార్చి 28వరకు ఖాళీలున్నాయి. (ఫిబ్రవరి 5,6,12,13, 16,17, 19, 20వ తేదీల్లో తప్ప)
- కళ్యాణ మండపం
తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం జనవరి 28 నుంచి 31వ తేదీల్లో ఖాళీలు ఉంది.

ఫోన్ నెంబర్లు
- ఈ దర్శన్ కౌంటర్ : 2707676
కళ్యాణ మండపం : 2550265
- వెబ్‌సైట్ : wwwttdseva online.com
ప్రతి మంగళవారం సెలవు.

-ఎంవీపీ కాలనీ



జ్ఞాపకాలు

# ఏటా లక్ష మందికి ఉచిత వైద్యం

జీవన దిశ మార్చిన ఇ.కె పరిచయం

మాస్టారు సూచనతో ఉచిత విద్య, వైద్యం

ఆధ్యాత్మిక భావనకు నాన్నగారే స్ఫూర్తి

కోల్‌కతాలో తెలుగువారికి గౌరవం ఉండేది

హోమియో వైద్యుడు కె.ఎస్.శాస్త్రి

**కోనసీమలోని సామాన్య కుటుంబంలో జన్మించారు. రెండు పదుల వయస్సు నిండకుండానే ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. విశాఖ రైల్వే డివిజన్ తొలితరం ఉద్యోగి. జగద్గురు పీఠం వ్యవస్థాపకుడు మాస్టర్ ఇ.కె. పరిచయంతో హోమియో వైద్యంలో అడుగుపెట్టారు. మూడు దశాబ్దాలుగా రోగులకు అలుపెరుగని వైద్య సేవలందిస్తున్నారు. ఎనిమిది పదుల వయస్సులో రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేస్తూ ఏడాదికి లక్ష మందికి ఉచితంగా వైద్యం చేస్తున్న జగద్గురు హోమియో వైద్యాలయం నిర్వాహకులు కొంపెల్ల సత్యనారాయణ శాస్త్రి జీవిత విశేషాలే ఈ వారం 'జ్ఞాపకాలు'**

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం దరి వేమవరం గ్రామంలో 1936లో జన్మించాను. తండ్రి కామేశ్వరరావు, తల్లి వెంకటరత్నం. ముగ్గురు కుటుంబంలో అన్నయ్య గౌరీ శంకర శాస్త్రి, అక్క ప్రభావతి. నేనే చిన్నవాడ్ని. నాన్న గారు మా ఊరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు.

### డబ్బున్నోళ్లు గుర్రపుబండిపై వచ్చేవారు

మా ఊరుకు మూడు మైళ్ల దూరంలోని అమలాపురం బోర్డు ఉన్నత పాఠశాలలో చేరా. ఒక చేత్తో పుస్తకాల సంచి, మరో చేత్తో క్యారియర్ పట్టుకొని ఉదయానికే స్కూల్‌కు నడిచివెళ్లేవాళ్లం. మా ఊరు నుంచి నాతోపాటు పాతిక ముప్ఫై మంది వరకు అదే స్కూల్లో చదివేవాళ్లం. ఎక్కువ మంది నడిచివెళ్లగా డబ్బున్న నలుగురైదురుగు మాత్రం గుర్రపుబండిలో వచ్చేవారు. అమలాపురం తాలూకాకు అదొక్కటే హైస్కూలు. ఆరు నుంచి 11వ తరగతి వరకు సుమారు నాలుగైదు వేల మంది విద్యార్థులు ఉండేవారు. పాఠశాలలో నిత్యం కోలాహలంగా ఉండేది.

### ఉచిత విద్య, వైద్యం ఆయన చెప్పిందే..

మానవుని వికాసానికి ప్రధానమైన విద్య, వైద్యం సాధ్యమైనంత వరకు ఉచితంగానే అందివ్వాలన్నది ఎక్కిరాల గారి ఆకాంక్ష. దానికి అనుగుణంగానే ఆయన జీవితాంతం సేవ చేశారు. వైద్యం అందించినవారి నుంచిగానీ, నేర్పిన వారి నుంచి ఆయన ఒక పైసా తీసుకోలేదు. ఆయన స్థాపించిన జగద్గురు పీఠం ఉద్దేశం కూడా అదే. జగద్గురు హోమియో వైద్యాలయం ప్రారంభించి రోజు వందలాదిమందికి ఉచితంగానే వైద్యం అందించారు. జనకులం పేరిట ఉచిత విద్యాలయం పెట్టి ఏడేళ్లపాటు ఉచితంగా విద్య అందించారు. దానినే క్రమంగా బాలభాను విద్యాలయంగా మార్చారు.

### టీచర్లంటే హడల్

అమలాపురం బోర్డు హైస్కూలులో పెద్ద మైదానం వుండేది. బెల్‌కొట్టిన తరువాత ఎవరైనా మైదానంలో ఉంటే హెచ్‌ఎం కోట పాలయ్య చూస్తే దండనే. ఆయనొక్కరే కాదు టీచర్లంటనే భయం. వారు కనిపిస్తే పక్కకు తప్పుకుని వెళ్లేవాళ్లం. ఎదురుపడే ధైర్యమేదీ. గణితం టీచరు రమణయ్య పాఠానికి క్రేజీ. ఆయన లెక్కలు చెప్పే సెక్షన్‌లోని సీటుకు పోటీ వుండేది. జాగ్రఫీ టీచరు బోర్డుపై గ్లోబ్ పెట్టి కట్టెతో దేశాలను గుర్తించేవారు. డ్రాయింగ్ టీచరు కాలి వేళ్ల మధ్య సుద్దముక్క పెట్టిబోర్డుపై బొమ్మలు వేసేవారు. అంతటి ప్రతిభావంతులు వద్ద చదువుకోవడం మా అదృష్టమే.

### చిన్నప్పడే కాకినాడకు మకాం

నేను ఫిఫ్తుఫారంలో వుండగానే నాన్నగారు కాలం చేశారు. వూరులో మాకంటూ ఆస్తులేమి లేకపోవడంతో కుటుంబమంతా కాకినాడకు మకాం మార్చేశాం. అన్నయ్య ఉద్యోగం చేసేవారు. కాకినాడ పీఆర్ కళాశాలలో ఎస్సెల్సీసీ పూర్తిచేశాను. తరువాత చదువుకు స్వస్తి చెప్పి టైప్ నేర్చుకొని ఉద్యోగ వేటలో పడ్డాను.

### మాచ్‌ఖండ్ నుంచి ఉద్యోగ జీవితం

ఎపీపీఎస్‌సీ పరీక్షలు రాసి టైపిస్టుగా ఎంపికై మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగ జీవితం ప్రారంభించాను. ఆ ఉద్యోగం చేస్తూనే రైల్వే సర్వీస్ కమిషన్ పరీక్షరాసి ఆగ్నేయ రైల్వేలో ఉద్యోగం రావడంతో కోల్‌కతాకు మకాం మార్చాను.

అక్కడే ఉద్యోగం చేస్తూ దీనబంధు కళాశాలలో రాత్రి తరగతుల్లో చేరి బికామ్ పూర్తి చేశాను. సెలవు సెలవుల్లో ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేవాడ్ని.

### కోల్‌కతాలో తెలుగువారికి గౌరవం

కోల్‌కతాలో తెలుగువారికి ఎంతో గౌరవం, గుర్తింపు ఉండేవి. మిగతా ప్రాంతాలతో పోల్చితే తెలుగువారికి ఇళ్లు అద్దెకు ఇచ్చేందుకు బెంగాలీలు ఇష్టపడేవారు. రైల్వేలో కూడా తెలుగు ఉద్యోగులకు పని అప్పగిస్తే పూర్తవుతుందని ఉన్నతాధికారులు నమ్మేవారు. అందుకే మాకు ప్రాధాన్యత ఇచ్చేవారు. రైల్వేలో తెలుగు ప్రాంతానికి చెందిన రమణరావు అనే ఉన్నతాధికారి ఎంతో మందికి ఉద్యోగాలు ఇచ్చేవారు. కోల్‌కతాలో వున్నప్పుడే హిందూస్థాన్ ఆక్సిజన్ కంపెనీలో అవకాశం వచ్చింది. అయినా వెళ్లలేదు.

### వాల్తేరు డివిజన్ తొలి ఉద్యోగులం

1963లో వాల్తేర్ రైల్వే డివిజన్ ఏర్పాటు చేశారు. ఈ డివిజన్‌లో పనిచేయడానికి ఆప్షన్ ఇచ్చిన పాతిక మందిలో నేనూ ఉన్నాను. అలా 1963లో కోల్‌కతా నుంచి విశాఖ వచ్చాం. డీఆర్ఎం ఛాంబర్‌తోపాటు అన్ని విభాగాలు చిన్నపాటి భవనాల్లో వుండేవి. మా విభాగమైతే షెడ్‌లో వుండేది. ఇక్కడ ఉద్యోగం చేస్తూనే అకౌంట్స్‌లో ఉన్నత కోర్సులు పూర్తి చేశాను. పదోన్నతులు వచ్చినా విశాఖలోనే స్థిరపడిపోయా.

### ఏడాదికి లక్షమందికి ఉచిత వైద్యం

జగద్గురు వైద్యాలయంలో ఏడాదికి లక్షమందికి ఉచితంగా హోమియో వైద్యం అందిస్తుండడం అనిర్వచనీయమైన సేవగా భావిస్తున్నాను. ఇది నిజంగా గురువుగారి ఆశీస్సులతోనే చేస్తున్నాం. రోజు ఉదయం ఏడు నుంచి పదకొండు గంటల వరకు వందలాది మంది వైద్యం కోసం వస్తుంటారు. విశాఖతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోను, పట్టణాల్లోను తమ శాఖలు వున్నాయి. అక్కడ కూడా ఉచితంగానే వైద్యం అందిస్తున్నాం. నాతోపాటు వంద మంది వరకు వలంటీర్లు రోగులకు సేవలు అందిస్తారు. మా దగ్గరకు వచ్చే ప్రతిరోగికీ నయం కావాలన్నదే మా తపన. దీర్ఘకాలిక రోగులు కూడా మా దగ్గరకు వస్తుంటారు. కొందరు రోగులకు సికిల్ సెల్ వ్యాధిని నయం చేయడం గొప్ప అనుభూతి. కేజీహెచ్‌లో స్టాఫ్‌నర్సు కుమార్తెకు సికెల్ సెల్ వ్యాధి నయమైతే అక్కడ వైద్యులు తొలుత నమ్మలేదు. తరువాత పరీక్షలు చేసి నిర్ధారించుకున్నారు.



### ఎక్కిరాల పరిచయంతో హోమియో వైద్యంలోకి..

మా అబ్బాయి శ్రీనివాస్ సీవియర్ డయేరియాతో బాధపడేవాడు. విశాఖలోని వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. తమతోపాటు రైల్వే క్వార్టర్స్‌లో వుండే బీఎస్ఎన్ శాస్త్రి అనే ఉద్యోగి సలహా మేరకు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య మా ఇంటికి వచ్చి శ్రీనివాస్‌కు ఒక్క డోసు మందు వేశారు. ఆయన వైద్యంతో రోగం నయం అయ్యింది. దీంతో నాకు హోమియో వైద్యంపై ఆసక్తి కలిగి ఎక్కిరాల వద్ద శిష్యునిగా చేరిపోయాను. ఆయన పెద వాల్తేర్‌లో ఉండేవారు. రోజూ మందుకోసం పెద్ద లైను ఉండేది. ఆయన వెంట వెళ్లి ప్రసంగాలు విని వైద్య విధానాన్ని ఆసక్తిగా గమనించాను. నాపై ఆయనకు నమ్మకం కలగడంతో ప్రోత్సహించారు. తన పక్కనే కూర్చుని వైద్యంలో మెళకువలన్నీ నేర్పించారు. ఆయన వారసునిగా నన్ను ప్రకటించారు.



### ఆధ్యాత్మిక భావాలకు నాన్నే స్ఫూర్తి

తండ్రి కామేశ్వరరావు అధ్యాత్మిక బావాలున్న వ్యక్తి. ఆయనకు సంగీతం, పురాణాలు, వ్యాకరణం ఇలా అన్ని విషయాల్లో పట్టుంది. వూరులో పిల్లలంతా ఆయన వద్ద ట్యూషన్‌కు వచ్చేవారు. ఆడ పిల్లలు , పెద్దవారు సంగీతం నేర్చుకునేవారు. వూరిలోని నాయీబ్రాహ్మణులు మా ఇంటి వద్ద పడుకుని తెల్లవారుజామున మూడుగంటలకు లేచి సన్నాయిపై సంగీత సాధన చేసేవారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా ఎవరివద్దా ఆయన పైసా తీసుకునేవారు కాదు.

### అధ్యాత్మిక ప్రచారం, అన్నదానం

జగద్గురు పీఠం నేతృత్వంలో వైద్యంతోపాటు అధ్యాత్మిక ప్రవచనాలు, పురాణగాథలపై మహిళలు, చిన్నపిల్లలకు అవగాహన కల్పిస్తాం. ప్రతి వారం వైద్యాలయంలో అన్నదానం వుంటుంది. ఇక నా కుటుంబం విషయానికి వస్తే భార్య రామలక్ష్మి. కాలం చేశారు. కుమార్తె సరోజా వెంకటరత్నం, కుమారులు శ్రీనివాస్, వెంకటేశ్వరప్రసాద్. పెద్దోడు రైల్వే, రెండో వాడు ఐటీలో స్థిరపడ్డారు.

– ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

### డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో..

**విశాఖపట్నం:** డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన భారత గణతంత్ర వేడుకల్లో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ కెప్టెన్ డీకే మహంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులను కాపాడుకోవాలన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో పౌరులుగా ఉన్నందుకు మనమంతా గర్వపడాలన్నారు. ఫైనాన్స్ డైరెక్టర్ పీవీ రమణమూర్తి, ఆపరేషన్స్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ కమొడోర్ జయపాల్, చీఫ్ విజిలెన్స్ అఫీసర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం గణతంత్ర దినోత్సవాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బసా సాధూరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి వెంకటరావు, కన్నయ్య, స్టీల్‌ప్లాంట్ ట్రేడుయూనియన్ నాయకులు వెంపాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా రెపరెపలు

### శ్రీప్రకాష్‌లో...

**అక్కయ్యపాలెం:** శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో శనివారం భారత గణతంత్ర వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన డాక్టర్ ప్రేమకుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ భాస్కరరావు, ప్రొఫెసర్ విశ్వనాథ్, రజనీముఖర్జీ సెవెల్‌హిల్స్, డాక్టర్ భాస్కరరావులు మాట్లాడుతూ రిపబ్లిక్‌డే ప్రాముఖ్యతను, రాజ్యాంగం ఏర్పడిన విధానం గురించి వివరించారు. వేర్పాటు వాదం, అవినీతి, అనైక్యత ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనవన్నారు. రాబోయే కాలంలో భారత్, చైనాలు అగ్రరాజ్యాలుగా అవతరిస్తాయన్నారు.విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ విద్యార్థులను అభినందించారు.



శ్రీప్రకాష్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన